

నగరం నుంచి పల్లెకు..

హైదరాబాద్‌తోపాటు పరిసర ప్రాంతాల్లో ఉంటున్న ప్రజలు సంక్రాంతికి సొంత ఊళ్లకు పయనమయ్యారు. - 8లో



ముగ్గు సెల్ఫీలకు ఆహ్వానం

సంక్రాంతి పండుగలో రంగవల్లులది ప్రత్యేకత. మీ ఇళ్ల ముంగిట అందమైన ముగ్గులు వేసి సెల్ఫీలు తీసుకుని మాకు పంపండి. మీ సెల్ఫీలను ఈ రోజు (ఆదివారం) పంపిస్తే సోమవారం సంచికలో ప్రచురిస్తాం.

మీరు సెల్ఫీ పంపాల్సిన వాట్సప్ నం. 99123 62784

న్యూస్‌రీల్

రికార్డులు పక్కాగా నిర్వహించాలి



దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న డీఏఓ శ్రవణ్‌కుమార్

మిర్యాలగూడ: ఫర్టిలైజర్స్ దుకాణాదారులు రికార్డులు పక్కాగా నిర్వహించాలని జిల్లా వ్యవసాయాధికారి పాల్వాయి శ్రవణ్‌కుమార్ అన్నారు. శనివారం మిర్యాలగూడ పట్టణంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించి మాట్లాడారు. ఈ పాస్ ద్వారానే దుకాణ యజమానులు ఎరువులు, యూరియా విక్రయించాలన్నారు. గోదామ్‌లో స్టాకు, ఈపాస్‌లో స్టాక్ సరితూగే విధంగా డీలర్లు ఏరోజుకారోజు స్టాక్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని కోరారు. ఫర్టిలైజర్ ఇన్వెంటరీ వెరిఫికేషన్ యాప్‌లో భాగంగా రికార్డులను పరిశీలించి నివేదికను ఆన్‌లైన్‌లో సమర్పిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే దుకాణాల్లో తనిఖీలు చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఓ సైదానా, ఏఈఓలు తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ జిల్లా జట్టుకు ఎంపికైన శ్రీజ

శాలిగౌరారం: మండలంలోని మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియట్ చదువుతున్న కొప్పుల శ్రీజ హ్యాండ్‌బాల్ జిల్లా జట్టుకు ఎంపికైంది. శనివారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని మేకల అభినవ్ స్టేడియంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి జూనియర్ బాలికల హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక జరిగింది. ఈ ఎంపికలో కొప్పుల శ్రీజ ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపికైనట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ మల్లేష్ తెలిపారు. ఈ నెల 15 నుంచి 17 వరకు ఆసిఫాబాద్ జిల్లాలో జరుగనున్న రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్‌లో శ్రీజ పాల్గొననుంది. ఆమెను పాఠశాల ప్రిన్సిపాల్ రాగిణి, పీడీ బొడ్డు మల్లేష్, ఉపాధ్యాయులు అభినందించారు.

కలెక్టర్‌ను కలిసిన ఐఎంఏ ప్రతినిధులు

నల్లగొండ టౌన్: నీలగిరి ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ)ప్రతినిధులు శనివారం నల్లగొండలోని కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ హరిచందనను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నీలగిరి ఐఎంఏ అధ్యక్షురాలు డా. అనితారాణి, కార్యదర్శి డా. రమేష్, కోశాధికారి డా. ప్రవీణ్, ఉపాధ్యక్షురాలు డా. రాజేశ్వరి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డా. పుల్లారావు, సలహాదారు డా. జయప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

న్యాయపరమైన అంశాలపై అవగాహన



పోలీస్ అధికారులకు అవగాహన కల్పిస్తున్న సీనియర్ లా ఫ్యాకల్టీ రాములు

నల్లగొండ క్రైం: భూ వివాదాలకు సంబంధించిన కేసుల్లో న్యాయపరమైన అంశాలపై పోలీస్ అధికారులు, సిబ్బందికి శనివారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో సీనియర్ లా ఫ్యాకల్టీ, న్యాయవాది ఎ.రాములు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చట్టపరమైన అంశాలు, దస్తావేజులు, అగ్రిమెంట్లు, రెవెన్యూ చట్టాలు, పోలీస్ స్టేషన్ పరిధిలో సివిల్ కేసుల్లో తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. భూ వివాదాల్లో శాంతిభద్రతల పాత్ర, పోలీసులు వ్యవహరించాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. సమావేశంలో ఎస్బీ డీఎస్పీ సోమ్‌నారాయణ్‌సింగ్, నల్లగొండ, మిర్యాలగూడ, దేవరకొండ డీఎస్పీలు శ్రీధర్ రెడ్డి, వెంకట్‌రెడ్డి, గిరిబాబు, డీసీఆర్‌బీ డీఎస్పీ సైదా, సీఐ ప్రసాద్ పాల్గొన్నారు.

భోగిభాగ్యాలు

మూడు రోజుల వేడుకైన సంక్రాంతి సంబరాలు ప్రారంభమయ్యాయి. గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసు కీర్తనలు, ఘుమఘుమలాడే పిండి వంటకాలు, ఆకర్షించే రంగవల్లులు ఈ పండుగ ప్రత్యేకం. భోగి, మకర సంక్రాంతి, కనుమ ఈ మూడు రోజులకు ఒక్కో ప్రత్యేకత ఉంది. ఆదివారం భోగి సందర్భంగా తెల్లవారుజాము నుంచే ఇళ్ల లోగిళ్లలో ముగ్గులు వేసి గొబ్బెమ్మలతో అలకరించడంతోపాటు భోగి మంటలు వేస్తారు. చిన్నారులకు భోగి పళ్లు పోస్తారు. ఆలయాల్లో గోదా రంగనాయకస్వామి కల్యాణం నిర్వహిస్తారు. జిల్లాలోని కొన్ని చోట్ల భోగి పండుగను ప్రత్యేకంగా జరుపుకుంటారు.



- మూడు రోజుల వేడుక సంక్రాంతికి పల్లెలన్నీ ముస్తాబు
- తొలిరోజున భోగి మంటలు, భోగి పండ్లు ప్రత్యేకం
- రంగవల్లులతో కళకళలాడనున్న లోగిళ్లు
- హరిదాసు కీర్తనలు, గంగిరెద్దుల విన్యాసాలతో సందడిగా మారనున్న గ్రామాలు
- కొన్ని ప్రాంతాల్లో ప్రత్యేకంగా వేడుకలు



మోత్కూరులో బోనాలు ప్రత్యేకం

మోత్కూరు : సంక్రాంతి పర్వదినాన్ని మోత్కూరులో ప్రత్యేకంగా జరుపుకుంటారు. భోగి పండుగ రోజున పట్టణంలోని గౌడ కులస్తులు కంఠ మహేశ్వర స్వామికి, ముదిరాజ్ కులస్తులు పెద్దమ్మ తల్లికి బోనాలు సమర్పిస్తారు. 2009లో కొత్త బస్టాండ్ సమీపంలోని పెద్దమ్మ తల్లి ఆలయాన్ని నిర్మించారు. అప్పటి నుంచి ముదిరాజ్ కులస్తులు భోగికి ముందు గణపతి పూజ, అభిషేకం, హోమాలు నిర్వహిస్తున్నారు. భోగి రోజున బోనాలు సమర్పించి.. సంక్రాంతి రోజున వన భోజనాలకు వెళ్లడం ఇక్కడ సంప్రదాయంగా మారింది. గౌడ కులస్తులు భోగి రోజున కంఠ మహేశ్వర స్వామికి సుమారు 20 ఏళ్లుగా బోనాలు సమర్పిస్తున్నారు. పట్టణంలోని బిక్కేరు వాగు వద్ద అమ్మనబోలు రోడ్డులో ఉన్న కంఠ మహేశ్వర స్వామి, జామచెట్లబావి గ్రామంలోని ఆలయాల వద్ద గౌడ మహిళలు బోనాలతో ప్రదర్శనగా వెళ్లి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు.



దీవించు బసవన్న

యాదగిరిగుట్ట : శుభోజయం మారాజా.. శుభోజయం.. మీ ఇంట పాడిపంటలు పొంగిపొర్లాల.. పిల్లా పాపలతో జయం కలగాల. దొరగారి బిడ్డలు సల్లాంగుండాల.. దొరసాని ఆడబిడ్డకు కల్యాణ యోగం కలగాలా.. శుభోజయం మారాజా.. శుభోజయం అంటూ గంగిరెద్దులతో దీవెనలు అందిస్తూ గంగిరెద్ల వారు చేసే విన్యాసాలు సంక్రాంతి పండుగ ప్రత్యేకం. సుప్రభాత వేళ ఆ మాటలు చెవికి తాకగానే ప్రజల మనస్సు తేలికవుతుంది. ఇంటి ముందు డూడూ బసవన్నతో కలిసి పేరుపేరునా దీవెనలు అందించేటప్పుడు కలిగే ఆనందం అంతా ఇంతా కాదు. సంక్రాంతి పండుగ మూడు రోజులు గంగిరెద్దుల ఆటలతో పల్లెలన్నీ సందడిగా మారుతాయి.



ఊరూరా విన్యాసాలు

గంగిరెద్ల కుటుంబాలు ధనుర్మాసం ప్రారంభం కాగానే వివిధ ప్రాంతాలకు సంచార జీవులుగా బయలు దేరుతారు. ఏటా ఆనవాయితీగా వచ్చే గంగిరెద్లవారు ప్రతి ఇంటి వాకిట నిలబడి ఆ ఇంటి యజమానులను పేరుపెట్టి పిలువడం విశేషం. అయ్యగారికి దండం పెట్టు.. అమ్మగారికి దండం పెట్టు అంటూ గంగిరెద్ల వారు పాడుతున్న పాటలకు లయబద్ధంగా గంగిరెద్దులు తలూపుతూ ఆడే తీరు అందరినీ ఆకర్షిస్తాయి. ఇంటి ఇల్లాలు ఇచ్చిన ధాన్యం, తౌడు బసవన్నకు తినిపిస్తారు. పాత, కొత్త బట్టలుంటే బసవన్నకు అర్పిస్తారు. ప్రతి గ్రామంలోనూ గంగిరెద్లతో నాట్యం చేయించి ఆటలు ప్రదర్శిస్తారు. దండిగా నజరానాలు ఇచ్చిన వారిని మెండుగా దీవించి గ్రామాలన్నీ ఆయురారోగ్య ఐశ్వర్యాలతో తులతూగాలని దీవించి మరీ వెళ్తుంటారు.

సొంతూరిలోనే పండుగ



చౌటుప్పల్ : మండల పరిధిలోని అంకిరెడ్డిగూడెం గ్రామంలో రెడ్డి కులస్తుల కుటుంబాలు సుమారుగా వంద వరకు ఉన్నాయి. వారంతా కలిసి సంక్రాంతి పండుగను ప్రత్యేకంగా జరుపుకుంటారు. జీవనోపాధి కోసం ఎక్కడికి వెళ్లినా.. పండుగకు మాత్రం సొంతూరికి వస్తారు. భోగి పండుగ రోజున వారంతా చౌరస్తా వద్ద శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి భోగి మంటలు వేస్తారు. ఒక నీటి కుండను భోగి మంటల్లో ఉంచుతారు. ఆ నీరు వేడయ్యాక ప్రతి ఇంటికీ ఒక్కో జగ్గు చొప్పున తీసుకెళ్లి.. సాధారణ నీటిలో కలుపుకొని ఆ కుటుంబ సభ్యులంతా స్నానాలు చేస్తారు. భోగి రోజున ఇలా ప్రత్యేక పూజలు చేయడం ద్వారా ఎలాంటి అనారోగ్య సమస్యకైనా పరిష్కారం లభిస్తుందని వారి నమ్మకం. ఈ భోగి పూజల్లో పాల్గొనేందుకు ఈ గ్రామ వాసులంతా ఎంతో ఆసక్తి కనబరుస్తారు.



భోగి వేడుక చిన్నారులదే..

- కవి వేణు సంకోజు



రామగిరి(నల్లగొండ) : తెలుగు పండుగల్లో సంక్రాంతి విశిష్టమైనది అంటున్నారు ప్రముఖ కవి వేణు సంకోజు. సంక్రాంతి పండుగ విశేషాలను ఆయన 'సాక్షి'తో పంచుకున్నారు. భోగి మంటలతో మొదలయ్యే సంక్రాంతి పండుగ ఆద్యంతం సంబరమే. మొదటి రోజు సూర్యోదయానికి ముందే భోగిమంటలు, ఆ తర్వాత బొమ్మల కొలువు, సాయంత్రం పిల్లలకు భోగి పళ్లు పోస్తారు. అసలు భోగి అంటేనే పిల్లల పండుగ. భోగి రోజున వేసే ముగ్గుకు ఒక ప్రత్యేకత ఉంటుంది.

ఆనందాలకు ప్రతీక

సంక్రమణ మహాపర్వానికి ముందు రోజుకు ఒక ప్రాధాన్యం ఉంది. దీనికి భోగిపర్వం అని పేరు. వాస్తవానికి చెప్పుకోవాలంటే భోగి వేడుకంతా చిన్నారులదే. ఈ రోజున రేగు పళ్లు భోగిపళ్లుగా మారిపోతాయి. ముత్తయిదువులందర్నీ పిలిచి వారితో పిల్లలకు దిష్టి తీయిస్తారు. దోసిలి నిండా రేగు పళ్లు, చిల్లర, చెరుకు ముక్కలు, బంతిపూల రెక్కలు కలిపి తలమీదుగా దిష్టి తీసి పోస్తారు. అందువల్ల ఈ పళ్లను భోగిపళ్లు అంటారు. భోగి పళ్ల ఆశీర్వాదాన్ని శ్రీమన్నారాయణుడి ఆశీస్సులుగా భావిస్తారు.

భోగి పులక

కొన్న ప్రాంతాల్లో భోగి రోజున రైతులు తమ సాగు భూమికి ఆనవాయితీగా కొంతమేర సాగునీరు పారించి తడి చేస్తారు. పంట పూర్తయిన తర్వాత మళ్లీ పంట ప్రారంభించడాన్ని పులకేయడం అంటారు. ఆనవాయితీగా భోగి రోజున పులకేయడాన్ని భోగి పులకగా పిలుస్తారు.

మూడు రోజుల పండుగ

సంక్రాంతి పండుగ రోజున అందరూ సంప్రదాయ వస్త్రాలు ధరించడం ఒక ఆనవాయితీ. సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించడాన్ని మకర సంక్రాంతి అంటారు. మొదటి రోజు భోగి మంటలతో, రెండవ రోజు పొంగలి, పిండి వంటలు, పితృ దేవతల, దేవతల పూజలు చేస్తారు. మూడవ రోజు ముక్కనుమ రోజు మాంసాహారం తీసుకుంటారు. హరిదాసుల హరికీర్తన, గంగిరెద్దుల ఆటలతో ఆద్యంతం ఆత్మీయతతో సంక్రాంతి పండుగ జరుపుకుంటారు. ఇంటి ముందుకు వచ్చిన హరిదాసులకు బియ్యం, వస్త్రదానం చేయడం సంప్రదాయంగా కొనసాగుతుంది. పండుగ నాడు వాయినాలు ఇచ్చుకోవడం ఆనవాయితీ.

ఉద్యమకారులను అణచివేసిన బీఆర్‌ఎస్

- రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



ఆత్మకూర్‌లో దయాకర్‌రెడ్డి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట): తెలంగాణ కోసం పోరాడిన ఎందరో ఉద్యమకారులను బీఆర్‌ఎస్ ప్రభుత్వం అణచివేసిందని రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. శనివారం ఆత్మకూర్ (ఎస్) మండల కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుడు కాకి దయాకర్‌రెడ్డి కాంస్య విగ్రహాన్ని మాజీ మంత్రి, టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు రాంరెడ్డి దామోదర్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో వీరోచితంగా పోరాడిన కాకి దయాకర్‌రెడ్డికి ప్రాధాన్యత కల్పించకుండా బీఆర్‌ఎస్ నేతలు అణచివేతకు గురిచేశారన్నారు. ఎస్సారెస్పీ రెండోదశ ఆయకట్టు దెబ్బతినడం వెనుక గత ప్రభుత్వం చేసిన తప్పిదాలే ఉన్నాయని, నాసిరకంగా మేడిగడ్డ ప్రాజెక్టును కట్టడంతో ప్రాజెక్టును ఖాళీ చేయాల్సి వచ్చిందని దీంతో నీటి కొరత ఏర్పడిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ప్రజల్లో పూర్తి పాజిటివ్ అభిప్రాయం ఉందని, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మరింతగా బలపడి 13, 14 ఎంపీ సీట్లు సాధిస్తామని తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పెండింగ్ నీటి పారుదల ప్రాజెక్టులకు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అంతకు ముందు మండల పరిధిలోని నెమ్మికల్లు దండుమైసమ్మ ఆలయంలో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యే మందుల సామేల్ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న, ఏఐసీసీ మెంబర్ సర్వోత్తమ్ రెడ్డి, కాకి జార్జిరెడ్డి, కాకి కృపాకర్‌రెడ్డి, కొప్పుల వేణారెడ్డి, కందాల వెంకట్‌రెడ్డి, దామిటి రమేష్‌రెడ్డి, అనురాధ, తంగెళ్ల లక్ష్మి, శిగ శ్రీను, కరుణాకర్ రెడ్డి, అబ్దుల్ రహీం, చకిలం రాజేశ్వరరావు, డాక్టర్ కొప్పుల రంగారెడ్డి పాల్గొన్నారు. .

గడువుకు ముందే ఆన్‌లైన్ పూర్తి

- ముగిసిన ప్రజాపాలన దరఖాస్తుల కంప్యూటరీకరణ
- నీలగిరి మున్సిపాలిటీలో 40,023 అర్జీలు
- ఆరు రోజుల్లోనే పూర్తిచేసిన యంత్రాంగం



నల్లగొండ మహిళా డిగ్రీ కాలేజీలో ఆన్‌లైన్ ఎంట్రీ చేస్తున్న సిబ్బంది

నల్లగొండ టూటౌన్: అభయహస్తం పథకం కింద ఆరు గ్యారంటీల అమలులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రజాపాలన కార్యక్రమం చేపట్టింది. తద్వారా ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ నీలగిరి మున్సిపాలిటీ యంత్రాంగం గడువుకు ముందే పూర్తి చేసింది. ఈనెల 6వ తేదీన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ పూర్తి కాగా, 7వ తేదీ నుంచి ఆన్‌లైన్ నమోదు మొదలుపెట్టిన యంత్రాంగం ఆరు రోజుల్లోనే పూర్తి చేసి రికార్డు సృష్టించింది. చాలా మున్సిపాలిటీలు, మండలాల్లో సాంకేతిక సమస్యల కారణంగా నేటికీ పూర్తికాలేదు. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 17వ తేదీలోగా ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేయాలని గడువు పెట్టగా నీలగిరిలో మాత్రం 12వ తేదీ (శుక్రవారం) రాత్రే పూర్తి చేశారు.

120 మంది సిబ్బందితో..

నీలగిరి మున్సిపాలిటీ పరిధిలోని 48 వార్డుల్లో మొత్తం 40,023 దరఖాస్తులు వచ్చాయి. వీటన్నింటిని ఆన్‌లైన్ చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో మున్సిపల్ కమిషనర్ ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో కంపూటర్లు అందుబాటులో ఉండడంతో కమిషనర్ వెళ్లి కళాశాల ప్రిన్సిపాల్‌తో మాట్లాడి కళాశాలలో దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియకు అనుమతి తీసుకున్నారు. దీంతో మొత్తం 120 మంది కంప్యూటర్ ఆపరేటర్లను పెట్టుకొని, వారికి ఆసరాగా మున్సిపల్ సిబ్బందిని కేటాయించి యుద్ధప్రాతిపదికన ఆన్‌లైన్ పూర్తి చేశారు. చాలా మండలాలు, మున్సిపాలిటీల్లో ఆన్‌లైన్ చేయడానికి కంప్యూటర్లు సైతం అందుబాటులో లేకపోవడం అధికారులకు చికాకు తెప్పిస్తోంది. కొన్ని చోట్లఉన్నా ఆన్‌లైన్ చేయడానికి అనుమతి ఇవ్వడం లేదని తెలుస్తోంది. నీలగిరిలో మాత్రం ఆ సమస్యను అధిగమించి అనుకున్న దానికి కన్నా నాలుగు రోజుల ముందే పూర్తి చేశారు.

సర్వర్ సమస్య వచ్చినా అధిగమించాం



మున్సిపాలిటీ పరిధిలోని 48 వార్డుల నుంచి 40,023 దరఖాస్తులు వచ్చాయి. 120 మంది కంప్యూటర్ ఆపరేటర్లు, ఇతర సిబ్బందితో ఆరు రోజుల్లో ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేశాం. సర్వర్ సమస్య వచ్చినా అధిగమించాం.

– కందుకూరి వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్, నల్లగొండ





వైభవంగా ఎదుర్కోలు

నల్లగొండ రామాలయంలో గోదా-రంగనాయక స్వామి కల్యాణం సందర్భంగా శనివారం రాత్రి చేపట్టిన ఎదుర్కోలు మహోత్సవం

స్వామి అమ్మవార్లను ఊరేగిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు

న్యాయ వ్యవస్థ గౌరవం పెంచాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి నాగరాజు

రామగిరి (నల్లగొండ): న్యాయ శాఖ ఉద్యోగులు అకుంఠిత దీక్షతో పనిచేసి న్యాయ వ్యవస్థ గౌరవాన్ని పెంచాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.నాగరాజు అన్నారు. శనివారం నల్లగొండలోని జిల్లా కోర్టు ప్రాంగణంలో జిల్లా న్యాయ శాఖ ఉద్యోగుల యూనియన్ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. అనంతరం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో న్యాయ శాఖ ఉద్యోగుల యూనియన్ జిల్లా అధ్యక్షుడు మాతంగి వీరబాబు, సూపరింటెండెంట్లు శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, యూనియన్ సభ్యులు సాగర్‌రెడ్డి, లతీఫ్, పాషా, గిరిధర్, రాంబాబు, వంశీకృష్ణ, జంగయ్య, సరిత, ఉష, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా ప్రధాన జడ్జి నాగరాజు, న్యాయ శాఖ ఉద్యోగులు

క్లుప్తంగా

మల్లూస్వర్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి



మల్లూస్వర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

మోతె : మాజీ ఎమ్మెల్యే ఉప్పల మల్లూస్వర్ జీవితాన్ని నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వరికుప్పల వెంకన్న అన్నారు. మోతె మండల పరిధిలోని సిరికొండ గ్రామంలో ఎంసీపీఐయూ ఆధ్వర్యంలో శనివారం మల్లూస్వర్ వర్ధంతి నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. 1952లో జరిగిన తొలి శాసన సభ ఎన్నికల్లో సూర్యాపేట ఎమ్మెల్యేగా ఎన్నికైన మల్లూస్వర్ 20ఏళ్ల నియోజకవర్గ ప్రజలకు సేవలందించారని వక్తలు కొనియాడారు. మరణించేంత వరకు చెప్పులు కుట్టుకుంటూ పూరి గుడిసెలో జీవనం గడపుతూ అందరికీ ఆదర్శ వంతుడిగా నిలిచాడని తెలిపారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు ముదిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, ఎస్‌కె నజీర్, ఏసూరి సోమన్న, కాంపాటి శ్రీను, నందిగామ కృష్ణారెడ్డి,నూకల ఉపేందర్‌రెడ్డి,నూకల రాజిరెడ్డి, మల్లూస్వర్ కూతురు పొంపంగి కొమరమ్మ పాల్గొన్నారు.

గాయపడిన మహిళ మృతి



నాగమణి మృతదేహం

మునగాల(కోదాడ): రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళ మృతిచెందింది. మునగాల మండలంలోని కొక్కిరేణి గ్రామానికి చెందిన జాల నాగమణి(31) కొంత కాలంగా మండలంలోని మాధవరంలో తన తండ్రి వద్ద ఉంటూ కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తోంది. శుక్రవారం రాత్రి మాధవరంలో కిరాణ దుకాణంలో సామగ్రి కొనుగోలు చేసి రోడ్డు పక్కన నిలబడి ఉంది. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న కారు అతివేగంగా వచ్చి నాగమణిని ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆమెను స్థానికులు సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతిచెందింది. మృతురాలి భర్త వీరబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లోకేష్ తెలిపారు.

నగరం నుంచి పల్లెకు..

- హైవేపై కొనసాగుతున్న పండుగ ప్రయాణపు రద్దీ
- ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు ఇదే పరిస్థితి
- విజయవాడ మార్గంలో బారులుదీరిన వాహనాలు
- రద్దీ కారణంగా అవస్థలుపడిన వాహనదారులు, ప్రయాణికులు



చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద వాహనాల రద్దీ



చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో ఇరుమార్గాల్లో నిలిచిన వాహనాలు

చౌటుప్పల్ : సంక్రాంతి పండుగను పురస్కరించుకొని హైదరాబాద్-విజయవాడ 65వ నంబర్ జాతీయ రహదారిపై ఏర్పడిన రద్దీ శనివారం సైతం కొనసాగింది. హైదరాబాద్‌తోపాటు పరిసర ప్రాంతాల నుంచి ప్రజానీకం పెద్ద సంఖ్యలో తమ స్వస్థలాలకు పయనమైన నేపథ్యంలో ఈ రద్దీ ఏర్పడింది. ప్రధానంగా ప్రజలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు బయలుదేరుతున్నందున జాతీయ రహదారిపై విజయవాడ మార్గంలో వాహనాలు కిక్కిరిసాయి. తెల్లవారుజాము నుంచి అర్ధరాత్రి వరకు ఇదే పరిస్థితి కొనసాగింది. చౌటుప్పల్ మండల పరిధిలోని పంతంగి టోల్‌ప్లాజా వద్ద ఏమాత్రం వాహనాలు జాం కాకుండా ఉండేందుకు జీఎంఆర్ సంస్థ నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు. ఆ మార్గంలో 12టోల్‌బూత్‌లను తెరిచారు. అదనపు సిబ్బందిని అందుబాటులో ఉంచారు. హైదరాబాద్ నుంచి సాధారణ రోజుల్లో టోల్‌ప్లాజా వరకు గంట సేపట్లో చేరుకుంటుండగా ఇప్పటి రద్దీ కారణంగా సుమారు రెండు గంటలకు పైగా సమయం పడుతుంది. టోల్‌ప్లాజా వద్ద గత శుక్రవారం 24గంటల్లో 68,628 వాహనాలు రాకపోకలు సాగించగా, అందులో కార్లు వంటి సొంత వాహనాలు 54,595 ఉన్నట్టుగా జీఎమ్మార్ అధికారులు తెలిపారు. కాగా, శనివారం రోజున సుమారుగా 80వేల పైచిలుకు వాహనాలు రాకపోకలు సాగించే అవకాశం ఉన్నట్టుగా అధికారులు అంచనా వేస్తున్నారు.

సమీక్షించిన పోలీస్ అధికారులు

జాతీయ రహదారిపై నెలకొన్న పండుగ రద్దీ నేపథ్యంలో పోలీసులు పరిస్థితిని సమీక్షించారు. రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు హైదరాబాద్ నుంచి పంతంగి టోల్‌ప్లాజా వరకు పరిశీలించారు. అదే విధంగా భువనగిరి అదనపు డీసీపీ రవికుమార్ సైతం పర్యవేక్షించారు. చౌటుప్పల్ ఏసీపీ వై.మొగిలయ్య, ట్రాఫిక్ ఏసీపీ ప్రభాకర్‌రెడ్డి, సీఐలు దేవేందర్, సైదులు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

రాంగ్‌రూట్ ప్రయాణాలతో..

పోలీస్‌శాఖ, జీఎంఆర్ సంస్థల నడుమ సమన్వయం కొరవడడంతో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై శనివారం ఇరుమార్గాల్లో రద్దీ ఏర్పడింది. రద్దీని నివారించే క్రమంలో అధికారులు విజయవాడ వైపునకు వెళ్లాల్సిన వాహనాలను రంగారెడ్డి జిల్లా కొత్తగూడెం వద్ద, చౌటుప్పల్ మండలం ఖైతాపురం, ధర్మోజిగూడెం ప్రాంతాల్లో రాంగ్‌రూట్‌లోకి పంపించారు. దాంతో హైదరాబాద్ మార్గంలో వాహనాలు ఎదురెదురుగా వెళ్లాల్సి వచ్చింది. కొద్దిసేపట్లోనే ఇరుమార్గాలు విపరీతంగా జాం అయ్యాయి. హైదరాబాద్ మార్గంలో వాహనాలు కనీసం ముందుకు కదలని పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో రాంగ్‌రూట్ రాకపోకల కారణంగా సుమారుగా ఐదు కిలోమీటర్ల మేరకు ట్రాఫిక్ జాం అయ్యింది. దీంతో చౌటుప్పల్ పట్టణ వాసులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ఒక్కో వాహనానికి అరగంట సమయం

బీబీనగర్: బీబీనగర్ మండలంలోని గూడూరు టోల్‌ప్లాజా వద్ద శనివారం కూడా వాహనాల రద్దీ నెలకొంది. పండుగ సెలవులు కావడంతో శుక్రవారం సాయింత్రం నుంచి వాహనాలు వరంగల్ వైపు బారులుదీరడంతో టోల్ వద్ద కిక్కిరిసిపోయాయి. సుమారు ఒక్కో వాహనం టోల్‌గుండా వెళ్లేందుకు అరగంటకు పైగా సమయం పట్టడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పండుగ సందర్భంగా సుమారు 30వేలకు పైగా వాహనాలు టోల్‌గుండా ప్రయాణించాయి.



బారులుదీరిన వాహనాలు

ఎనిమిది కౌంటర్ల నుంచి విజయవాడ వైపు..

కేతేపల్లి: హైవేపై వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని కేతేపల్లి మండలంలోని కొర్లపహాడ్ టోల్ గేట్ వద్ద ఉన్న 12 టోల్ కౌంటర్లకు గాను 8 కౌంటర్‌లను విజయవాడ వైపు వెళ్లే వాహనాలకు కేటాయించారు. వాహనాలు టోల్‌గేట్ దాటేందుకు పది నుంచి పదిహేను నిమిషాలకు పైగా సమయం పట్టింది. ఉదయం 11 గంటల తర్వాత తగ్గుముఖం పట్టిన వాహనాల రద్దీ సాయంత్రం 4 గంటలకు మళ్లీ పెరిగింది. శనివారం ఒక్కరోజులోనే దాదాపు 40 వేల వాహనాలు వెళ్లినట్లు జీఎమ్మార్ అధికారులు పేర్కొన్నారు. వాహనాల రద్దీ నేపథ్యంలో ట్రాఫిక్ నియంత్రణకు టోల్ నిర్వాహకులు, పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. జీఎమ్మార్ అధికారులు, కేతేపల్లి ఎస్‌ఐ శ్రీకాంత్‌గౌడ్ టోల్‌ప్లాజా వద్దనే మకాం వేసి ట్రాఫిక్‌కు అంతరాయం కాకుండా చర్యలు తీసుకున్నారు.



కేతేపల్లి మండలం కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద వాహన బారులు

భువనగిరిలో ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు



నృత్యం చేస్తున్న చిన్నారి

భువనగిరి : భువనగిరి జిల్లా కేంద్రంలో సంక్రాంతి సంబరాలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. జాతీయ యువజనోత్సవాల సందర్భంగా జిల్లా యువజన సంఘాల సమితి ఆధ్వర్యంలో జిట్టా బాలకృష్ణారెడ్డి, జిట్టా రాధమ్మ ఫౌండేషన్ సహకారంతో పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి గ్రామీణ క్రీడా పోటీలు, సంక్రాంతి సంబురాలు రెండో రోజు శనివారం కూడా కొనసాగాయి. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు కబడ్డీ, వాలీబాల్, టెన్నికాయిట్, క్యారమ్స్, చెస్ పోటీలు జరగగా సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు, జానపద నృత్యాలు నిర్వహించారు. ఈ సందర్భంగా దూం దాం వ్యవస్థాపకులు కళాకారుడు అంతరుపుల నాగరాజు బృందం పాడిన పాటలు అందరినీ అకట్టుకున్నాయి, యూట్యూబ్ స్టార్లు గంగ, నాగలక్ష్మి, దండెపల్లి శ్రీను, ప్రసాద్‌లు పాడిన పాటలు అలరించాయి. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో పుస్తక ప్రదర్శన, తెలంగాణ పిండి వంటలను ప్రజలు తిలకించారు. హరిదాసుల, గంగిరెద్దుల విన్యాసాలు అలరించాయి. యువతులు, మహిళలు చేసిన నృత్యాలు అకర్షించాయి. కార్యక్రమంలో యువజన సంఘాల వ్యవస్థాపక అధ్యక్షుడు జిట్టా బాలకృష్ణారెడ్డి, కౌన్సిలర్ గోమారి సుధాకర్‌రెడ్డి, అందె శంకర్,అజీమోద్దీన్,ఎడ్ల రాజేందర్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు రమేష్,రాజేష్, యువ సంఘాల నాయకులు చంద్రశేఖర్, దాసరి శ్రీనివాస్, పీఈటీలు పాల్గొన్నారు.



కోలాటం ఆడుతున్న మహిళలు



రేలరేలారే గంగ జానపద పాటలతో నృత్యాలు చేస్తున్న యువతీ యువకులు



ముగ్గుల పోటీలో పాల్గొన్న యువతులు



కబడ్డీలో తలపడుతున్న క్రీడాకారులు

రోగి మెడలో ఆభరణాలు అపహరించిన దొంగల అరెస్ట్



కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ బీసన్న, ఎస్‌ఐ సంపత్‌గౌడ్

నాగార్జునసాగర్ : ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగి మెడలోని బంగారు ఆభరణాలు అపహరించిన ఇద్దరు దొంగలను పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ బీసన్న, ఎస్‌ఐ సంపత్‌గౌడ్ నిందితుల వివరాలు వెల్లడించారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు డ్యాం డివిజన్ బీఅండ్‌ఆర్ కార్యాలయ ఉద్యోగి మోరం లక్ష్మి తన భర్త రామ్మోహన్‌రావుతో కలిసి అనారోగ్యంతో బాధపడుతున్న అత్త రమణమ్మను (70) గత డిసెంబర్ 17న సాగర్ కమలా నెహ్రూ ఆస్పత్రిలో చేర్పించారు. అదే నెల 21న రమణమ్మ ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలు అపహరణకు గురైనట్లు కుటుంబ సభ్యులు గుర్తించారు. అయితే, మరుసటి రోజు మృతిచెందింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. నమ్మదగిన సమాచారం మేరకు అదే ఆస్పత్రిలో స్వీపర్‌గా పనిచేసే పగిడి కళ్యాణ్‌కుమార్‌తో పాటు భోనగిరి వీరయ్యలను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారు. దొంగిలించిన పుస్తెల తాడులో గల ఒక బంగారు పుస్తె, మూడు బంగారు కాసులు, నాలుగు బంగారు గుండ్లు తన స్నేహితుడు భోనగిరి వీరయ్యలు కలిసి గుర్తుతెలియని వ్యక్తులకు విక్రయించారు. రూ.20వేలు రాగా ఇరువురు పంచుకుని ఖర్చు చేశారు. వారి వద్ద విక్రయించగా మిగిలిన ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామని, నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చనున్నట్లు సీఐ తెలిపారు. కేసు ఛేదనలో కీలకంగా వ్యవహరించిన ఎస్‌ఐ సంపత్‌గౌడ్ ఏఎస్‌ఐ వెంకట్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ గురునాథం, శంకర్‌బాబు, కానిస్టేబుల్ జావీద్,కిరణ్ హోంగార్డులు నర్సింహ, లాలూ, బి.వి.శ్రీను.ప్రభు, రామ్మోహన్, దౌలత్‌ఖాన్‌లను సీఐ బీసన్న అభినందించారు.

ముష్టిపల్లిలో అనుమతులు లేకుండా మైనింగ్

- కాంట్రాక్టర్, సహకరిస్తున్న రైతుపై కేసు



ముష్టిపల్లిలో మైనింగ్ చేసి తీసిన పలుగురాళ్లు

నాంపల్లి : అనుమతులు లేకుండా మైనింగ్ చేస్తున్న ఓ కాంట్రాక్టర్‌తో పాటు రైతుపై శనివారం నాంపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్‌ఐ లచ్చిరెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నాంపల్లి మండలం ముష్టిపల్లి పంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 136లో గ్రామానికి చెందిన పరుశురాం ఆధీనంలో ఉన్న భూమిలో ఆంధ్రాకు చెందిన కాంట్రాక్టర్ మేకల శ్రీనివాస్ నాయుడు కొంతకాలంగా మైనింగ్ చేయిస్తున్నాడు. భూమిని చదును చేయించి పలుగురాళ్లను రవాణా చేస్తున్నాడు. ఈ విషయంపై సమీప రాజ్యాతండా రైతులు, గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కాంట్రాక్టర్ శ్రీనివాస్‌నాయుడు, సహకరిస్తున్న రైతు పరుశరాంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

రెండు దశాబ్దాలుగా సంక్రాంతికి ముగ్గుల పోటీలు

- ఏటా మూడు రోజుల పాటు క్రీడలు కూడా..
- ఆదర్శంగా నిలుస్తున్న నేతాజీ యువజన మండలి



ముగ్గుల పోటీలను పరిశీలిస్తున్న యువజన మండలి సభ్యులు, గ్రామస్తులు

ఆత్మకూరు(ఎం): దాతల సహకారంతో రెండు దశాబ్దాలుగా నేతాజీ యువజన మండలి ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగకు మూడు రోజుల పాటు ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో ముగ్గుల పోటీలు, క్రీడలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. నేతాజీ యువజన మండలిని 1979లో స్థాపించారు. గత ఇరవై ఏళ్లుగా ప్రతియేడు సంక్రాంతి పండుగ సందర్భంగా మూడు రోజుల పాటు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గ్రామీణ క్రీడలు, ముగ్గుల పోటీలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తోంది. ఎప్పటిలాగే ఈ సారి కూడా మాజీ ఎంపీపీ జన్నాయికోడె అమృతమ్మ-శంకరయ్య జ్ఞాపకార్థం వారి కుమారులు యుగంధర్, నగేష్(సర్పంచ్) సహకారంతో నిర్వహిస్తున్నారు.

మూడు రోజుల పాటు నిర్వహిస్తాం





నేతాజీ యువజన మండలి ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగకు మంచి గుర్తింపు తెస్తాం. సంక్రాంతి సందర్భంగా దాతల సహకారంతో గ్రామీణ క్రీడలను నిర్వహిస్తాం. ప్రతి ఏటా దాతలు మంచిగానే సహకరిస్తున్నారు. ముందు ముందు ఇదే విధంగా సహకారం అందించాలని కోరుతున్నాం. – శ్యాంతన్‌రాజు, ఎలిమినేటి మురళీకృష్ణ, యువజన మండలి అధ్యక్ష, కార్యదర్శులు

తల్లి మందలించిందని బలవన్మరణం



పూజిత(ఫైల్)

అర్వపల్లి: తల్లి మందలించిందనే కారణంతో గడ్డిమందు తాగిన యువతి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. జాజిరెడ్డిగూడెం మండలం బొల్లంపల్లి గ్రామానికి చెందిన చింతల యాదయ్య-సైదమ్మల నాలుగో కుమార్తె పూజిత(17) సూర్యాపేటలోని సాయిగౌతమి జూనియర్ కళాశాల హాస్టల్‌లో ఉంటూ ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతుంది. సంక్రాంతి పండుగకు సెలవులు ఇవ్వడంతో పూజిత శుక్రవారం మధ్యాహ్నం కళాశాల నుంచి ఇంటికి వచ్చింది. చదువు విషయమై తల్లి సైదమ్మ కూతురు పూజితను మందలించింది. ఈ కారణంతో పూజిత వెంటనే వ్యవసాయ బావి వద్దకు వెళ్లి అక్కడ ఉన్న గడ్డి మందు సేవించింది. చుట్టుపక్కల వారు చూసి సూర్యాపేటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి మృతిచెందింది. మృతురాలి సోదరి లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు అర్వపల్లి ఎస్‌ఐ బి.అంజిరెడ్డి తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



పెద్దకందుకూరులో దగ్ధమవుతున్న ఇల్లు

యాదగిరిగుట్ట రూరల్: షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. ఈ ఘటన యాదగిరిగుట్ట మండలంలోని పెద్దకందుకూరు గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు, ఫైర్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం. పెద్దకందుకూరు గ్రామానికి చెందిన సోదరులు గుర్రం మహేందర్, గుర్రం సుదర్శన్ ఒకే పెంకుటిళ్లలో కుటుంబ సభ్యులతో కలిసి జీవనం సాగిస్తున్నారు. శనివారం సాయంత్రం ఇంట్లో షార్ట్ సర్క్యూట్ కావడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో ఇంట్లో వారందరూ బయటకు పరిగెత్తారు. స్థానికులు ఫైర్ స్టేషన్‌ను సంప్రదించగా ఘటనాస్థలానికి చేరుకుని ఎగిసిపడుతున్న మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఇంట్లో ఉన్న వస్తు సామగ్రి, ఫర్నిచర్, బంగారంతో సహా రూ.6 లక్షల వరకు ఆస్తినష్టం జరిగిందని ఫైర్ సిబ్బంది ప్రాథమిక అంచనాకు వచ్చారు. బాధితులు మాత్రం 15 లక్షల వరకు ఆస్తినష్టం జరిగిందని వాపోయారు. మంటలు ఆర్పిన వారిలో ఫైర్ సిబ్బంది, జమిందార్ జె. వెంకట్ రెడ్డి, నరేష్ కుమార్, కాశీ, ప్రభు ఉన్నారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత



అక్షింతల పంపిణీలో పాల్గొన్న రామానంద ప్రభూజీ

బొమ్మలరామారం : దైవచింతన అలవర్చుకోవడం ద్వారా మానసిక ప్రశాంతత చేకూరుతుందని సాయిధామం పీఠాధిపతి రామానంద ప్రభూజీ పేర్కొన్నారు. బొమ్మలరామారం మండలంలోని ప్యారారం, జలాల్‌పూర్, గోవింద్‌తండాలో శనివారం అయోధ్య రామయ్య అక్షింతల వితరణలో ఆయన పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ భక్తి భావం అలవచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చిమ్ముల సుధీర్‌రెడ్డి, సర్పంచ్‌లు సంగిశెట్టి వెంకటేష్, రవీందర్‌రెడ్డి, సక్రి, గుండ్ల గోపాల్‌గౌడ్, బొమ్మకంటి మల్లేష్, భూపాల్‌రెడ్డి, సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.